



వంకాయల వెంకటేశ్వర రావు

ఆనంద్ బెంగుళూరులోని 'మైకో'లో చీఫ్ ఫైనాన్స్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. భర్త, పిల్లల ఆనందమే తన జీవిత పరమార్థంగా భావించే అమృతమయి సుశీల ఆ యింటి యిల్లాలు. ఆ దంపతులిద్దరికీ రెండు కళ్ళు వాళ్ళ పిల్లలు దీప్తి, సందీప్. బిషప్ కాటన్, మౌంట్ కార్మెల్ పబ్లిక్ స్కూళ్ళలో చదువుతున్నారు.

ఆ రోజు వాళ్ళు నలుగురూ యింటి ముందు లాన్‌లో కుర్చీలు వేసుకు కూర్చుని, సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. దీప్తికి టెన్త్ క్లాసు పబ్లిక్ పరీక్షలు క్రిందటిరోజే అయిపోయాయి.

"దీప్తీ, ఎగ్జామ్స్ ఎలా వ్రాశావ్?" క్యాజువల్‌గా ఆనంద్ కూతుర్ని అడిగారు.

"ఐ డిడ్ వెరీ వెల్ డాడీ. ర్యాంక్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాను" దీప్తి సంతోషంగా చెప్పింది. ఆ మాటలకు ఆనంద్ ఏమీ ఆశ్చర్యపడలేదు. దీప్తి స్టేట్ ర్యాంక్ తెచ్చుకుంటుందని అతనికి ఎప్పటినుంచో తెలుసు. దీప్తి తెలివితేటలకి కృషికి, ఆమెకు స్టేట్‌ర్యాంకు వస్తే కాదు- మిస్ అయితేనే అతన్ని ఆశ్చర్యపరిచేది.

"మెడిసిన్ చదువుతావా? లేకపోతే సివిల్ సర్వీసెస్‌కు వెళ్తావా? దాన్నిబట్టి ఇంటర్‌లో సబ్జెక్ట్సు తీసుకోవచ్చు"

దీప్తిని అడిగాడు.

"మెడిసిన్, సివిల్ సర్వీసెస్ రెండూ నాకిష్టంలేదు డాడీ. రీసెర్చి చెయ్యాలని ఉంది. ఏ ఆక్స్‌ఫర్డ్‌లాంటి గొప్ప యూనివర్సిటీలోనో టీచింగు, రిసెర్చి చేస్తూ జీవితం గడపాలని నా లైఫ్ ఏంబిషన్" దీప్తి అభిప్రాయాల్ని, మాటల్ని 'చైల్డిష్‌టాక్'గా నెట్టివేయ లేదు వయస్సు పదిహేను నిండక పోయినా, మనస్సు వికసించిన కూతురి ఆశల్ని ఆశయాల్ని మన్నించాలనే ఆయన నిర్ణయించుకున్నారు.

"మేడమ్ క్యూరీ అడుగుజాడల్లో నడవబోతున్నది" దీప్తిని ఆటపట్టిస్తూ సందీప్ వెక్కిరించాడు

"నువ్వు గవాస్కర్ అడుగుజాడల్లో నడిచినట్టుగా!" తమ్ముడివంక టీజింగ్‌గా చూస్తూ దీప్తి తిరిగి 'రెపాటీ' చెప్పింది. ఈ మధ్య, ఇంటర్‌స్కూల్ సి.కె. నాయుడు క్రికెట్ టోర్నమెంటుకు సందీప్ ఎన్నికయ్యాడు ఆ టోర్నమెంటు కోసమని వరుసగా రెండునెలలు ప్రొద్దునా సాయంకాలం కష్టపడి ప్రాక్టీసు చేసి, చివరికి అసలు టోర్నమెంటులో డక్కౌట్ అయ్యాడు...

"చూడు మమ్మీ, యీ దీప్తి నన్నెలా ఆట పట్టిస్తున్నదో!" సందీప్ ముంగ మూతి పెట్టాడు. వాళ్ళిద్దర్ని చూసి సుశీల తృప్తిగా నవ్వింది.

అంతలో గేటు తీసుకుని లోపలకు అడుగు పెడుతున్న మనిషిని చూసి ఆనంద్ ఎదురెళ్ళి ఆదరంగా ఆహ్వానించి తీసుకొచ్చాడు.

"సుశీలా! హైద్రాబాదు ఏ.జీ. ఆఫీసులో నేను పనిచేసేటప్పుడు విశ్వం నా కొలీగ్. నిన్న అనుకోకుండా 'మెజెస్టిక్' సర్కిల్‌లో కనిపించాడు. ఈ హై-ఫ్లయింగ్ మాన్‌కి మనింటికి రావటానికి యీ వేళకుగాని వీలుపడలేదు" భార్యకు పరిచయం చేసాడు. ఆమె మర్యాదగా అతనికి నమస్కరించింది.

కాఫీ, స్నాక్సు తీసుకురావటానికి దీప్తి లేచి ఇంట్లోకి వెళ్ళింది.

"హైదరాబాదు ఏ.జీ. ఆఫీసులో నేను విశ్వం కలిసి ఆరేళ్ళు పనిచేసాం. పెద్ద ఉద్యోగంలో చేరాలని నేనేమో కాస్ట్ అక్కౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ కోర్సులు చదువుతుంటే విశ్వం కథలు, నవలలు రాస్తూ పేరు సంపాదించి సినిమా డైరెక్టరు అయ్యాడు. పదేళ్ళ తర్వాత మళ్ళీ యిప్పుడు కలుసుకున్నాం" ఆనంద్ ఉత్సాహంగా భార్యకు చెబుతున్నాడు.

"నేను సినిమా ఫీల్డులో చేరాక మద్రాసులో సెటిలయ్యానండి. ఆనంద్ యిక్కడ బెంగుళూరులో పనిచేస్తున్నాడని నాకు తెలియదు. లేకపోతే, సినిమా షూటింగులకని బెంగుళూరు వచ్చినప్పుడల్లా మీ యింటికి వస్తుండేవాణ్ణి" విశ్వం చెప్పాడు.

అంతలో దీప్తి స్నాక్స్, కాఫీ పట్టుకొచ్చింది. స్నాక్స్ ట్రే అందిస్తున్న దీప్తివంక చూసి విశ్వం ఒక్క క్షణం విశ్చేష్టుడయ్యాడు. శిల్పి చక్కగా తీర్చిదిద్దినట్టున్న శరీరాకృతి, అందమయిన బేబీ ఫేస్ నిండా స్వీట్ ఇన్నోసెన్స్, అమాయకంగా నవ్వే విశాలమైన కళ్ళు, స్నిగ్ధ మనోహరమయిన చిరునవ్వు ఓహ్...వోణీ లంగా వేసుకుని మోకాళ్ళ వరకూ వేలాడుతున్న జడతో నడుస్తున్నపుడు బాపుగీసిన బొమ్మలాగా కళ్ళు తెరిచి చూస్తున్నపుడు డచ్ చిత్రకారుడు రెంబ్రాండ్ట్ చిత్రపటంలా, నవ్వుతున్నపుడు రవివర్మ అందించిన అందములా అనిపించింది.

ఆ రాత్రి చాలా పొద్దుపోయేవరకూ ఆనంద్, విశ్వం యిద్దరూ కూర్చుని చిన్ననాటి సంగతుల్ని ముచ్చటించుకుంటున్న సమయంలో, విశ్వం సంకోచిస్తూ అడిగాడు- "ఆనంద్ ఇలా అడుగుతున్నందుకు అపార్థం చేసుకోకు. నేను తీయబోయే ఒక సినిమాలో మీ దీప్తి నటించేందుకు అంగీకరిస్తావా?"

"లేదు విశ్వం! మా దీప్తి సినిమాల్లో నటించటం నా కిష్టంలేదు" ఆనంద్ తిరస్కరించాడు.

"ఒక మంచి సినిమాకు నా దగ్గర స్క్రిప్టు రెడీగా ఉంది. సరైన నూతన నటి కోసం అన్వేషిస్తున్నాను. మీ దీప్తి చక్కగా రాణిస్తుంది. మంచికథ ఉంది. దానికి తోడు నటన గురించి నేను తీసుకునే ప్రత్యేక శ్రద్ధ వల్ల మీ దీప్తి నేషనల్ లెవెల్ గుర్తింపు పొందే అవకాశముంది."

విశ్వం మాటలకు ఆనంద్ ఆలోచనలో పడ్డాడు. "సుశీల, దీప్తి యిష్టా యిష్టాలు తెలుసుకునిగాని నేను ఏ సంగతీ చెప్పలేను" ఆనంద్ జవాబుకు విశ్వం సంతోషపడ్డాడు. అర్ధాంగీకారం లభించినట్టే!

"ఒకే ఒక షెడ్యూల్లో నెలరోజుల్లో సినిమా షూటింగు మొత్తం బెంగుళూరులోనే తీస్తాను. దీప్తి శలవులు అయిపోయేసరికి సినిమా పూర్తవుతుంది. తర్వాత దీప్తి మామూలుగా కాలేజీలో చేరవచ్చు" అని చెప్పి విశ్వం సుశీలను కూడా ఒప్పించాడు.

అదొక ట్రైయాంగులర్ లవ్ స్టోరీ. కిరణ్, సంధ్య బావామరదళ్ళు. చిన్నప్పట్నుంచి ఇద్దరూ పరస్పరం అనురాగం పెంచుకున్నారు. అమెరికాలో చదువుతున్న కిరణ్ కి, శలవుల్లో ఇండియాకు రాగానే సంధ్యతో పెళ్ళి జరిపించాలని ఇరువైపుల పెద్దలు నిర్ణయిస్తారు. కిరణ్ కూడా అంగీకరిస్తాడు. బావతో పెళ్ళి గురించి మధురూహల్లో తేలుతున్న సంధ్య, కిరణ్ ఎప్పుడు ఇండియాకు వస్తాడాని ఎదురుచూస్తుంటుంది. ఇండియాకు వచ్చిన కిరణ్ సంధ్యను కాకుండా, సంధ్య వాళ్ళింట్లో అంతకు

ముందే పనిపిల్లగా చేరిన మల్లిని చూసి ఆమె అద్భుత సౌందర్యానికి ఆకర్షితుడై ప్రేమలో పడి, మల్లిని పెళ్ళిచేసుకుంటాడు. క్లుప్తంగా సినిమా కథ అది... మల్లిగా దీప్తి నటిస్తోంది.


సినిమా షూటింగ్ జరుగుతుండగానే టెన్త్‌క్లాసు రిజల్ట్సు వచ్చాయి. దీప్తికి స్టేట్‌లో సెకెండ్ ర్యాంక్ వచ్చింది. అనుకున్నట్టుగానే, కాలేజీలు తెరిచే సమయానికి సినిమా షూటింగ్ పూర్తయింది. దీప్తి ఇంటర్ సైన్సు స్ట్రీమ్‌లో చేరింది. కొద్ది రోజుల్లోనే, ఆమె నటించిన సినిమా రిలీజయింది. అన్ని కేంద్రాల్లో సూపర్ హిట్. దీప్తి లలిత సౌందర్యం, సునిశిత నటన ప్రేక్షకులందరి ప్రశంసల్ని పొందింది. ఇంటర్ ఫస్టు సెమిస్టర్ పూర్తిగాక ముందే, ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్, సినీ గోయర్స్ అసోసియేషన్ అవార్డ్, ఫిల్మ్ క్రిటిక్స్ అవార్డ్ మొదలయినవి వెంట వెంటనే వచ్చాయి. "అనదర్ స్టార్ బోర్న్ వోవర్ సదరన్ స్కయ్", "మ్యాకల్ కిడ్ టర్న్స్ ఎ బిగ్ స్టార్" మొదలైన హెడ్డింగులతో దీప్తి గురించి మెయిన్ స్ట్రీమ్ నేషనల్ మీడియాలో కూడా రాశారు. దానితో తెలుగు తమిళ సినీ ఫీల్డులోని పెద్ద సంస్థల నుండి పెద్ద మొత్తాలతో దీప్తికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. ఆ పెద్ద మొత్తాలను తిరస్కరించగల శక్తి సుశీలకు, ఆనంద్‌కు లేదు.

"డాడీ! విశ్వం అంకుల్ ప్రతిమలా దాదని, సరదాకోసం నేను ఆ సినిమాలో నటించాను. అంతేగాని, సినీ ఫీల్డులో కెరీర్ మొదలుపెట్టడానికి నాకిష్టం లేదు. ఆదిలోనే నా చదువు మానివేయాలనే ఊహ కూడా భరించలేను" దీప్తి అభిప్రాయాలు, ఉద్రేకం తండ్రి ముందు నిలువలేదు.

"నిన్ను చదువు మానివేయమని నేను చెప్పటంలేదు బేబీ. కాలేజీకి వెళ్తూనే సినిమాలో కూడా ఏక్ట్ చేయవచ్చు. ఇంత పెద్ద సినిమాసంస్థల నుండి వచ్చిన ఆఫర్స్‌ని తిరస్కరిస్తే, మళ్ళీ అటువంటి అవకాశాలు రావు" ఆనంద్ నచ్చ చెప్పారు. దీప్తి యింకేమి చెప్పగలదు? వరుసగా కాల్‌షీట్ల మీద సంతకాలు చేసింది. అన్ని కాల్‌షీట్లు వుంచుకుని ఇంకెక్కడి క్లాసులకి వెళ్ళగలదు? కాలేజీ పూర్తిగా మానివేయవలసి వచ్చింది.

అంతేకాదు! ఆమె జీవిత గమనమే పూర్తిగా మారిపోయింది. ఇన్‌డోర్ షూటింగుల్లో రోజూ మూడు షిఫ్టుల్లో విరామం లేకుండా నటిస్తున్నది. అవుట్‌డోర్ షూటింగ్‌లకోసం దేశం నలుమూలలకి వెళుతున్నది.

నిన్నటి మొన్నటిదాకా 'మిక్కీ మౌస్', 'స్నోవైట్ అండ్ ది సెవెన్ డ్వార్ఫ్స్' వంటి కార్టూన్ సినిమాలు చూసి సంతోషంతో చప్పట్లుకొట్టిన ఆ పద్నాలుగేళ్ళ పాప, ఇప్పుడు ముప్పై



ఏళ్ళ వయసుహీరోల సరసన పాటు ప్రేమ సన్నివేశాల్లో, అరవై ఏళ్ళ ముసలి హీరోల ప్రక్కన వాటు సరసాల్లో నటిస్తోంది. ఇంతకుమునుపులాగా తండ్రితో కలిసి పొద్దునపూట జాగింగ్‌కు వెళ్ళేందుకు ఇప్పుడు అవకాశంలేదు. ప్రొద్దునే జాగింగ్ చేస్తున్నట్టు, అలసిపోయే మధ్యాహ్నం ఎండలో కొన్ని సినిమాల్లో నటించింది. చిన్నప్పటినుండి నేర్చుకున్న 'షటిల్' ఇప్పుడు మరిచిపోయింది. ఇదివరకులాగా స్కేటింగుకు వెళ్ళేందుకు వీలులేదు. కాకపోతే, ఏ కాశ్మీరలోనో స్కేటింగ్ చేస్తూ డ్యూయెట్లలో నటిస్తుంది. సాయంకాలం పూట ఫ్రెండ్సుతో కలిసి సరదాగా తిరిగేందుకు అసలే అవకాశం లేదు. అప్పుడప్పుడు అలా నటిస్తుంది. ఏ మిడ్‌నైట్ షిఫ్టు లోనో.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆమె ఇప్పుడు తార. మనీ, గ్లామర్‌తో మిల మిలలాడే సినీ ఆకాశంలో ఇప్పుడిప్పుడే మిణుకుమంటున్న తార. చిరకాలం నిలిచే తారలా ఉజ్వలంగా వెలుగుతుందో, వెలిగీవెలగకుండా రాలుతుందో భవి ష్యత్తే నిర్ణయించాలి...

ఎండమావిలాంటి తారాపథం కోసం, నిండుకుండలాంటి ఆ పాప బాల్యం, చదువు, జీవన గమనం అన్నీ పణంగా పెట్టబడ్డాయి.

• • •